

స్టీల్ బ్రిడ్జి సిద్ధం

- రామాయపల్లి వద్ద రైల్వేలైనుపై ఏడేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు
- వచ్చేనెలలో వాహనాల రాకపోకలకు అనుమతిచ్చే అవకాశం

7

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిలో నిర్మలా జగ్గారెడ్డి

సర్వాయి పాపన్న ఉద్యమాలను కొనియాడిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 315వ వర్ధంతి కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, గౌడ కులస్థులు పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సమానత్వం కోసం పోరాడారని గుర్తుచేశారు. పన్నులను వ్యతిరేకించి మొగల్ చక్రవర్తులపై ఉద్యమంచేసి బడుగు బలహీనవర్గాలకు బాసటగా నిలిచిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కేజీకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, బీరయ్య యాదవ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి

రైతులకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

- సకాలంలో బ్యాంకు రుణాలు ఇవ్వాలి
- ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రాంలింగారెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రైతులు సకల సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మారెడ్డి రాంలింగారెడ్డి ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబరులో జరిగిన శాసన సభ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నిలపెట్టుకోలేదు అన్నారు. ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేసి ఆదుకుంటామని గొప్పలు చెప్పుకుంటాం అని ప్రచారం చేసుకోవడం తప్ప ఆచరణలో మాత్రం లో చూపించడం లేదు, రైతు భరోసా కోసం రైతాంగం ఎదురుచేస్తున్నారని, అయినా ప్రభుత్వనికి కనపడలేదు అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన హామీలను నెరవేర్చలని కోరుతూ ఈ నెల 7 న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి, జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రైతు రక్షణ సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతురక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రాంలింగారెడ్డి

ప్రజాపాలనలో లంబాడీలకు

తీవ్ర అన్యాయం

నంగునూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లంబాడీ హక్కుల పోరాట సమితి పిలుపు మేరకు లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం ఇంటి ముట్టడికి వెళ్లకుండా గిరిజన సంఘ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ముఖ్య బిక్షపతి నాయక్ అన్నారు. హక్కుల సాధన కోసం నేతలను అరెస్టు చేస్తే ఉద్యమాలు ఆగబోన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్న లంబాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రజాపాలన ముసుగులో లంబాడీలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే లంబాడీల అస్తిత్వం ఆత్మగౌరవంతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. తెలంగాణలో అత్యధికంగా లంబాడి జనాభా ఉన్నారని, ఇంతవరకు మంత్రివర్గం లో లంబాడీలకు స్థానం కల్పించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం నిజ స్వరూపం బయట పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన గ్రామ పంచాయతీ తాండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే తండాలకు ప్రత్యేక వీఆర్‌ఏలను కేటాయించాలని కోరారు. మంత్రి వర్గ విస్తరణలో లంబాడా వర్గానికి మంత్రి పదవి ఇవ్వకుంటే తడకా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌సీ మరమ్మతు పనుల్లో

నాణ్యత కరువు

- రెండున్నరేళ్ల క్రితం చిన్నకోడూరు పీహెచ్‌సీకి రూ.30 లక్షలు మంజూరు
- అధికారుల పర్యవేక్షణ.. తూతూమంత్రంగా పనులు
- పెండింగ్ పనులతో సిబ్బంది, రోగులకు తప్పని ఇక్కట్లు

8

నిధులొచ్చాయ్

- తొలిసారిగా సిద్దిపేట మున్సిపల్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు
- ఎస్‌టీపీ నిర్వహణ, మున్సిపల్ ఆదాయం పెంచినందుకు..
- ఇప్పటికే ఎస్‌టీపీ నిర్వహణకు రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు
- పట్టణ జనాభా ప్రాతిపదికన మరో రూ. 12 కోట్లు వస్తాయని అంచనా
- రాష్ట్రం నుంచి అర్హత సాధించిన పది బల్దియాలలో సిద్దిపేటకు స్థానం



సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్రస్థాయిలో మెరిసిన సిద్దిపేట మరోసారి తనకీర్తిని చాటుకుంది. కొన్ని నెలలుగా నిధులు లేక అభివృద్ధికి దూరంగా ఉంటున్న సిద్దిపేట మున్సిపల్‌ను అదృష్టం వరించి 15వ ఆర్థిక సంఘంలో అర్హత సాధించి నిధులను రాబట్టుకుంటున్నది.

సిద్దిపేటలో కోట్లాది రూపాయల నిధులతో నిర్మించుకున్న అండర్‌గౌండ్ డ్రైనేజీ మురుగు నీటిశుద్ధి కేంద్రం సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్వహణలో మేటిగా నిలవడంతో కేంద్రం నుంచి రూ.2.50 కోట్లు నిధులు ఇప్పటికే మంజురయ్యాయి. తాజాగా మున్సిపల్ ఆదాయవనరులు పెంచడంతో 15వ ఆర్థిక సంఘంలో అర్హత సాధించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 మున్సిపాలిటీలు అర్హత సాధించి, ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేసుకోగా సిద్దిపేట మున్సిపల్ కూడా తక్కువ కాదనట్టుగా టాప్ టెన్‌లో నిలిచింది.

సిద్దిపేట మున్సిపల్‌కు తొలిసారిగా

1952లో సిద్దిపేట నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి పట్టణం మున్సిపల్‌గా అవతరించింది. మున్సిపల్‌గా సిద్దిపేట ఉన్నప్పటికి సిద్దిపేట అభివృద్ధి కమిటీ పేరిట పాలన ను నిర్వహించారు. ఆ తరువాత 1957లో 10 వార్డులుగా ఏర్పడడంతో ఎన్నికలు జరుగగా 10 మంది కౌన్సిలర్లతో కౌన్సిల్ ఏర్పడింది. రానురాను మున్సిపల్ గ్రేడ్ 2 నుంచి స్పెషల్ గ్రేడ్ వరకు సిద్దిపేట మున్సిపల్ ఎదిగింది. అంచెలంచెలుగా అభివృద్ధిని సాధించిన సిద్దిపేటకు కేంద్రం నుంచి మున్సిపల్‌కు రావాల్సిన నిధులు వచ్చినప్పటికీ ఆర్థిక సంఘంలో మాత్రం అర్హత సాధించలేదు. ఇన్నేళ్ల చరిత్ర లో తొలిసారిగా అర్హత సాధించి 15వ ఆర్థిక సంఘం నుంచి నిధుల వచ్చేలా శ్రమించింది.

ఆదాయం పెంచినందుకు...

సిద్దిపేట పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించి వెలువడుతున్న మురుగు నీరును శుద్ధి చేసేందుకు పట్టణ శివారులో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ను నిర్మించారు. వెలువడుతున్న మురుగు నీటిని శుద్ధి చేస్తూ స్థానిక చెరువులోకి వదులుతున్నారు. అందుకు గాను ఎస్‌టీపీ నిర్వహణ పక్కాగా అమలు చేస్తున్నందుకు ఆర్థిక సంఘం నుంచి రూ.2.50 కోట్లు ఇప్పటికే మంజురయ్యాయి. దాంతో పాటుగా సిద్దిపేట పట్టణంలో ఆదాయ వనరులైన ఆస్తి పన్ను డిమాండ్‌ను పెంచి వసూళ్లు చేస్తున్నందుకు ఆర్థిక సంఘంలో అర్హతను సిద్దిపేట మున్సిపల్ సాధించింది. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గానూ సిద్దిపేట మున్సిపల్ ఆస్తిపన్ను రూ. 12.52 కోట్ల డిమాండ్ ఉండగా, 2024-2025కు గానూ రూ. 16.81 కోట్ల డిమాండ్ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో మున్సిపల్‌కు ఆదాయం పెంచడంతో పాటు రూ. 14.74 కోట్లను వసూలు చేసింది. ఈ మేరకు 15వ ఆర్థిక సంఘంలో అర్హత సాధించగా, పట్టణ జనాభా ప్రాతిపదికన రూ. 12 కోట్ల మేర 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

దేశ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు...

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులతో పాటు రాష్ట్రస్థాయిలో సిద్దిపేట మున్సిపల్ 22 అవార్డులను ఇప్పటికే కైవసం చేసుకుంది. రాష్ట్రంలోనే ఇన్ని అవార్డులు సాధించిన ఘనత కూడా సిద్దిపేట మున్సిపల్‌కే దక్కుతుంది. అటు దేశస్థాయిలో, ఇటు రాష్ట్రస్థాయిలో సిద్దిపేట మున్సిపల్ స్వచ్ఛ పట్టణంగా కీర్తి గడించింది. ఇంటింటికీ చెత్త సేకరణ, క్లీన్ సిటీ, పారిశుధ్య నిర్వహణ, పట్టణంల నలువైపులా హరితవనం, ఇంటింటికి తాగునీరు అందించడం, స్వచ్ఛబడి



మిగతా 7వ పేజీలో

మిషన్ భగీరథ

ఎస్ఈగా వెంకట్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా గ్రిడ్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డి సిద్దిపేట జిల్లాకు ఎస్‌గా పదోన్నతిపై విచ్చేశారు. ఆయన జిల్లా మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బాధ్యతలను స్వీకరించారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఈ వెంకట్ రెడ్డి

అనంతరం కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వేసవిలో ఎక్క డా కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఇదివరకు ఎస్ఈగా పనిచేసిన శ్రీనివాస్ చారి పదవి విరమణ పొందారు.

పర్యావరణ సమతుల్యతపై

జాతీయ సెమినార్

సిద్దిపేటకల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ సహకారంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్రం, ఐక్యూఏసీ, జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నేడు, రేపు జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ సెమినార్‌లో వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు, పర్యావరణ సమగ్ర అభివృద్ధి అనే అంశంపై సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి సామాజిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సదసులో పాల్గొననున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు హాజరు కావలసిందిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సునీత, సదస్సు కన్వీనర్లు యస్. హరిబాబు, డాక్టర్ అయోధ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ మధుసూదన్ కోరారు.

సదరం క్యాంపును

సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా

సిద్దిపేటకలెక్టరేట్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): సదరం క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 17, 24 క్యాంపు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు మీసేవలో యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



విద్యార్థుల కేరింత

- ముగిసిన పదోతరగతి పరీక్షలు



సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 79 పరీక్ష కేంద్రాల్లో మార్చి 21 నుంచి ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలో 14,124 మంది రెగ్యులర్ విద్యార్థులకు మొత్తంగా 14మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 99.93 హాజరు శాతం నమోదైంది. 79 సెంటర్లకు 79 మంది చీఫ్ సూపరెంటెండెంట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ప్రతి 20 మందికి ఒక ఇన్విజిలేటర్ విధులు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలూ జరగకుండా సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 79 పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేశారు. వృత్తి విద్యకు సంబంధించిన రెండు పరీక్షలు ఉన్నాయి. ఆ రెండు పరీక్షలు గురు, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా 19 సెంటర్స్‌లో జరగనున్నాయి. ఈ నెల 7 నుంచి సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల మూల్యాంకనం చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



కులమతాలు వేరైనా

మనమంతా ఒక్కటే

- మంత్రి దామోదర్ రాజనర్సింహా

మునిపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కులమతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. రంజాన్ పండుగ అనంతరం నిర్వహించే ఈద్‌మిలాప్ కార్యక్రమాన్ని బుధవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఈద్‌మిలాప్‌లో మతసామరస్యం వెల్లివిరియడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లోడి సతీష్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ అసద్‌పటేల్, మాజీఎంపీటీసీ బుర్కల పాండు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లిలో ఈద్ మిలాప్‌కు హాజరైన మంత్రి దామోదర్‌కు ఆహ్వానం పలుకుతున్న మైనారిటీ నాయకులు

జోగినాథ జాతరకు

అంకురార్పణ

- గణపతి పూజ, పుణ్యాహవాచనంతో శ్రీకారం
- గరుడ గంగతో అభిషేకం



గణపతి హోమం నిర్వహిస్తున్న చైర్మన్, సభ్యులు

జోగిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జోగిపేటలోని వైక్రాంతగిరిపై వెలసిన జోగినాథ స్వామి జాతరకు బుధవారం అంకురార్పణ చేశారు. వేకువ జామున గణపతిపూజ, పుణ్యాహవచనం జరిపిన ఆలయ పూజారులు మడుపతి భద్రయ్య స్వామి, మడుపతి సిద్దేశ్వరప్ప, సదాశివప్పలు ఉత్సవాలను లాంచనంగా ప్రారంభించారు. అనంతరం, పట్టణంలోని మత్స్యకారులు మంజీరా నది నుంచి గరుడ గంగను తీసుకువచ్చిన జోడు లింగాలకు అభిషేకం జరిపించారు. అంతకుముందు, శివపార్వతులు, వినాయకుడి ఉత్సవ విగ్రహాలను రాజేశ్వర మందిరం నుంచి సంగమేశ్వర ఆలయం మీదుగా, క్లాక్‌టవర్, గౌని చౌరాస్తాలగుండా జోగినాథ గుట్టపైకి పల్లకీ తీసుకువచ్చారు. తర్వాత, రథోత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్, సభ్యులు హెచ్.రామాగౌడ్, రంగ సురేశ్, పట్లూరి శివశేఖర్, చింతల సురేశ్ గుప్త, చాపల వెంకటేశం, మహేందర్, తుపాకుల సునీల్, పీర్ల సుధాకర్, అల్లె యాదగిరి, అరిగె రాములు పాల్గొన్నారు. ,











బీవిజనీర్స్ ఫెలోషిప్‌కు స్వామినాథన్

మిరుదొడ్డి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన జర్రా స్వామినాథన్ ప్రతిష్ఠాత్మకమైన మెర్సి డెస్ బెంజ్ బీవిజనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. దీనికి సంబంధించి గత అక్టోబర్‌లో పరీక్ష జరుగగా బుధవారం ఫలితాలు వెలువడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా 1000మందిని ఈ ఫెలోషిప్‌నకు ఎంపిక చేశారు.








మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- మూడు బైకులు, కారు దగ్ధం
- రూ.15 లక్షల ఆస్తి నష్టం

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వీమార్ట్ వెనుక భాగంలోని ఒకరి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఇంట్లో మంగళవారం రాత్రి 12.30 గంటలకు ఇంట్లో కరెంట్ మీటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే ఉన్న బెలానో కారు, ఒక ఫ్యాషన్ ప్రొ బైకు, రెండు స్కూటీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ అధికారులు, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ అధికారులు తెలిపారు.



దగ్ధమైన బైక్‌లు, కారు

వెయ్యి మందితో పది మూల్యాంకనం

రామచంద్రాపురం టౌన్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం విషయంలో అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం అశోక్‌నగర్ సెయింట్ ఆర్నాల్డ్ ప్రవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన పది మూల్యాంకనం కేంద్రాన్ని సందర్శించారు. జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 15 వరకు మూల్యాంకనం జరపడానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన దాదాపు వెయ్యి మందిని విధుల్లోకి తీసుకున్నామని వివరించారు.

పదోతరగతి స్పాట్‌ను బహిష్కరిస్తాం

- తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గతేడాది పది మూల్యాకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించకపోతే ఎస్‌ఎస్‌సీ స్పాట్‌ను బహిష్కరిస్తామని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, లక్ష్మణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12 నెలలు గడుస్తున్నా. నేటి రేమ్యూనరేషన్ ఇవ్వకపోవడం ప్రభుత్వానికి విద్యాశాఖ మీద ఉన్న నిర్లక్షపు ధోరణిని తెలియజేస్తోందన్నారు. రేమ్యూనరేషన్‌ను ఖాతాలో జమ చేయాలని, లేనియెడల ఈనెల 6 నుంచి ప్రారంభమయ్యే స్పాట్‌ను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

ఐడీఏబొల్లారానికి రూ.15కోట్లు

ఐడీఏబొల్లారం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పారిశ్రామిక పట్టణం అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరయ్యాయి. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ వారు నిధులు మంజూరు చేశారని మాజీ జడ్‌పీటీసీ సభ్యుడు కొలన్ బాల్‌రెడ్డి చెప్పారు. నిధులను సీసీరోడ్లు, మురుగునీటి పైపులైన్ నిర్మాణాలకు వినియోగించనున్నామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. టెండర్‌లు పిలుస్తున్నామని వివరించారు.

ఆర్ఐ సస్పెండ్.. తహసీల్దార్ బదిలీ

కొండాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఓ భూవి ఫౌతి మార్పు, కుటుంబ సభ్యుల వారసత్వ ధృవీకరణ మంజూరులో అవకతవకలకు పాల్పడిన కొండాపూర్ ఆర్ఐని సస్పెండ్, తహసీల్దార్‌ను బదిలీ చేస్తూ బుధవారం కలెక్టర్ క్రాంతి వల్లూరి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఐ పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణంగా ఓ పట్టాదారు మరణ వాంగ్మూలం పంచనామా నివేదిక అధారంగా తప్పుడు వారసత్వ ధృవీకరణ పత్రాన్ని తహసీల్దార్ మంజూరు చేశారు. అవకతవకలు జరిగినట్లు కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన కలెక్టర్ అర్ఐ మహాదేవ్‌ను సస్పెండ్ , తహసీల్దార్ అనితను నారాయణఖేడ్ ఆర్‌డీవోకు అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఖేడ్‌లో నీటి సరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి సంపు వద్ద మోటార్ చెడిపోయినందున, ఈనెల 3న పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల, ఎడ్ల బజార్, మజీద్‌ట్యాంకు, రాంమందిర్ ట్యాంకులకు నీటి సరఫరా కాదని, అందువల్ల ఆయా ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.



క్రైం కార్నర్

సరదా కోసం వచ్చి మృత్యు ఒడికి

● చెరువులో పడి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి


మనీష్ మృతదేహం

నర్సాపూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా ప్రకృతిని ఆస్వాదించేందుకు వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ శివారు గాజుల రామారం పరిధిలోని మహదేవపురానికి చెందిన నాగేశ్వరరావు కొడుకు బెల్లం మనీష్(19) హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని వీఎన్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. మనీష్ అతడి స్నేహితులు హరిశంకర్, లాస్య, కౌటిల్య, సంజయ్, సాత్విక్‌లతో కలిసి బుధవారం సరదాగా నర్సాపూర్ సమీపంలోని పచ్చని ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చారు. ఈ క్రమంలో నర్సాపూర్ రాయరావు చెరువు తూము సమీపంలో కూర్చొని ముచ్చట పెడుతుండగా మనీష్ ఒక్కసారిగా అదుపుతప్పి నీటిలో పడి మునిగిపోయాడు. తోటి విద్యార్థులు కాపాడటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బందితోపాటు పోలీసులు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మనీష్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మనీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు.

అధికంగా మద్యం సేవించి వ్యక్తి మృతి

చిలప్‌చెడ్, ఎప్రెల్ 2(ఆంధ్రజ్యోతి): అధికంగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జగ్గంపేట గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సిరిపురం గ్రామానికి చెందిన గంగిరెడ్డుల భాషా(45) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జగ్గంపేట గ్రామంలోని ఎస్‌వీఆర్ వైన్స్‌లోని పర్మిట్ రూమ్‌లో పడి ఉన్నాడు. కుమారుడు వెతుక్కుంటూ అక్కడికి వచ్చి లేపడానికి ప్రయంత్నించాడు. ఎంతకీ చలనం లేకపోవడంతో ఆర్ఎంపీ వైద్యుడిని తీసుకువచ్చి చూపించగా పరిశీలించిన ఆయన మృతి చెందినట్లు తెలిపారు. అధికంగా మద్యం సేవించి మృతి చెందాడని, ఎవరిపైనా అనుమానం లేదని మృతుడి కుమారుడు గంగిరెడ్డుల అంబదాసు పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ..


శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్(40)కు భార్య, కూతురు ఉన్నారు. గత 7 సంవత్సరాల క్రితం సిద్దిపేటకు చెందిన లావణ్యతో వివాహమైంది. శ్రీనివాస్ మానసికంగా బాగాలేక మద్యానికి బానిసయ్యాడు. మూడు సంవత్సరాల క్రితం లావణ్య భర్తపై, కుటుంబ సభ్యుల పైన గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు పెట్టింది. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి లావణ్య పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్ గత నెల 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక..


అర్కల శ్రీనివాస్

తూప్రాన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లికి చెందిన అర్కల శ్రీనివాస్ (56) వ్యవసాయం చేసుకుంటూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతడి కొడుకులు వ్యాపారం, ఉద్యోగ నిమిత్తం కొంపల్లిలో ఉంటున్నారు. శ్రీనివాస్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం పక్కింటికి చెందిన శ్రీనివాస్ అన్న కుమారుడు అర్కల విష్ణు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. పెద్దకుమారుడు అర్కల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి..

పటాన్‌చెరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీరంగూడకు చెందిన నూరవెంకటేశం (45) కిష్టారెడ్డిపేట నుంచి ఇంద్రేశం వైపు పటాన్‌చెరు పట్టణ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో బుధవారం బైక్‌పై వస్తున్నాడు. వెనకనుంచి వేగంగా దూసుకొచ్చిన కారు బలంగా బైక్‌ను ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ కారును సంఘటనా స్థలంలోనే వదిలి పరారయ్యాడు. అక్కడికి చేరుకున్న మృతుడి బంధువులు ఆ కారును ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● వ్యక్తికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో బైక్‌లు, వ్యక్తి

నిజాంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారు వద్ద బుధవారం సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన చింతకింది భాను ద్విచక్రవాహనంపై పులిమామిడి గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ ద్విచక్రవాహనంపై వస్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్ర గాయాలపాలైన భానుని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి చిన్నాన్న రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

గంజాయి పట్టివేత


నిందితుడిని అరెస్టు చేసిన అధికారులు

నర్సాపూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఇంట్లో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణంలోని జగన్నాథరావుకాలనీకి చెందిన వెంకటేశ్ ఇంట్లో గంజాయి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇంట్లో ఓ మూలన ప్లాస్టిక్ కవర్‌లో దాచి ఉంచిన 310 గ్రామాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేశారు. ఈ దాడిలో డీటీఎఫ్ సీఐ గోపాల్, ఎస్ఐ బాలయ్య, సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, రవి, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి సిద్ధం

● రామాయపల్లి వద్ద రైల్వేలైన్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు
● త్వరలో పూర్తికి చర్యలు.. వచ్చే నెలలో వాహనాలకు అనుమతి
● తీరనున్న వాహనదారుల అవస్థలు


రామాయపల్లి వద్ద నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి

తూప్రాన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు హైవే వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. వర్షకాలం వచ్చిందంటే హైవేపై వెళ్లాలంటేనే వాహనదారులకు జంకుపుట్టేది. ఐదారేళ్లగా పడుతున్న కష్టాలు గతేడాది కొంత తీరిపోగా, ఈసారి వర్షకాలం నాటికి పూర్తిగా తొలగిపోనున్నాయి. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయపల్లి రైల్వే లైన్‌పై భారీ స్టీల్ బ్రిడ్జి (బోస్టింగ్ గడ్డర్) నిర్మాణ పనులు చివరి దశకు చేరడమే అందుకు కారణం. కొద్దిరోజుల్లో మొత్తం పనులు పూర్తి చేసే మే నెలలో వాహనదారులకు అందుబాటులోకి తేనున్నారు.

45.4 మీటర్ల పొడవు..

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు 151 కిలోమీటర్ల పొడవైన రైల్వే లైన్ నిర్మాణం కోసం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్ద హైదరాబాద్ - నాగపూర్ మార్గంలో 44వ జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. హైవే రోడ్డును రామాయపల్లి వద్ద రైల్వే లైన్ క్రాస్ చేయాల్సి ఉంటుంది. అందుకు స్టీల్ బ్రిడ్జి (బోస్టింగ్ గడ్డర్)ని రూ. 109 కోట్లతో 45.4 మీటర్ల పొడవు నిర్మిస్తున్నారు. ఇది దేశంలోనే అతి పొడవైన, వెడల్పు అయినది. ఈ బ్రిడ్జి పనులకు 2018 ఆగస్టు 29న అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైల్వే లైన్ పూర్తి చేసే వరకు వాహనాలు వెళ్లేందుకు తాత్కాలిక పనులుగా భూమిపై (లోతుగా) రైల్వేలైన్ కింది నుంచి అండర్ పాస్‌లు నిర్మించారు.

మొదట్లో ముందుకు సాగని పనులు

స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అనుమతులు త్వరగా రాకపోవడం, స్టీల్ బ్రిడ్జి బరువు అంచనా తక్కువగా వేయడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి 387 టన్నులకు అంచనా వేయగా, భారీ వ్యత్యాసంగా 646 టన్నులకు పెరిగిపోయింది. ఇందుకు నిర్మాణ వ్యయం రూ. 109 కోట్ల నుంచి రూ. 116 కోట్లకు పెరిగిపోయింది. పెరిగిన అంచనా వ్యయం అనుమతులు, రైల్వే అనుమతులు రావడంలో కాలం గడిచిపోయింది. నాలుగైదు ఏళ్ల ఆలస్యం కావడంతో యేటా వర్ష కాలంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2020లో ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు హైవే మీదుగా వెళ్లు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెప్టెంబరులో అండర్‌పాస్‌లోకి నీరు చేరి తొలగించేందుకు మూడు రోజుల సమయం పట్టడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒకే వైపు స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అనుమతులు, అదనపు అంచనా నిధులు మంజూరు కావడంతో గతేడాది ఫిబ్రవరి నాటికి హైదరాబాద్ - నాగ్‌పూర్ వైపు వెళ్లే మార్గం స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రారంభించారు. ప్రస్తుతం హైదరాబాద్ - నాగ్‌పూర్ ఒకే మార్గంలో వాహనాలను స్టీల్ బ్రిడ్జి మీదుగా అనుమతి ఇచ్చారు. గతేడాది వర్ష కాలంలోనూ నాగ్‌పూర్ - హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం స్టీల్ బ్రిడ్జి నాగ్‌పూర్ - హైదరాబాద్ మార్గం పూర్తి చేసేందుకు రైల్వే అనుమతులు రావడంతో నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. అతిపొడవైన బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో స్టీల్ బ్రిడ్జిపై 350 టన్నుల బరువును ఆపగలిగే బేరింగ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బ్రిడ్జికి నాలుగు చొప్పున రెండు బ్రిడ్జిలపై 8 బేరింగ్‌లు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ చివరినాటికి స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి మే నెలలో వాహనాలను అనుమతించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


అండర్‌పాస్‌లోకి నీరు చేరడంతో కిలోమీటర్ల పొడవున నిలిచిన వాహనాలు (ఫైల్)

మే లో వాహనాలకు అనుమతి

రామాయపల్లి వద్ద స్టీల్ బ్రిడ్జి పనులు ఈనెలాఖరు వరకు పూర్తవుతాయి. వచ్చే నెల మేలో బ్రిడ్జి మీదుగా వాహనాలకు అనుమతిస్తాం. వర్షం కాలం నాటికి అండర్ పాస్ ఇబ్బందులు లేకుండా పోతాయి.

- ఉపేంద్రకుమార్, జీఎంఆర్ ప్రాజెక్టు మేనేజర్


పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో రికవరీ అయిన సెల్ ఫోన్లను బాధితులకు అందిస్తున్న అధికారులు

సెల్‌ఫోన్ రికవరీలో పాపన్నపేట పీఎస్ ఫస్ట్

● పోర్టల్ ప్రారంభం నుంచి 228 ఫోన్లు రికవరీ
● మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

పాపన్నపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న సెల్ ఫోన్లను రికవరీ చేయడంలో పాపన్నపేట పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో నిలిచిందని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో రికవరీ చేసిన మొబైల్స్‌ను బుధవారం ఫిర్యాదు దారులకు సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సారా శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 3404 మొబైల్ పోయినట్లు ఫిర్యాదులు అందగా వాటిలో 1846 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. అందులో పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 304 మొబైల్ పోయినట్లు ఫిర్యాదులు రాగా, 228 రికవరీ చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందిన వెంటనే ఐఎంఈఐ నెంబర్లు బ్లాక్ చేసి మొబైల్‌లను రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను సురక్షితంగా భద్రపరచుకోవాలన్నారు. ఫోన్ల రికవరీ కోసం అసాధారణ కృషి చేసిన పాపన్నపేట కానిస్టేబుల్ దుర్గాప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

బైకును తప్పించబోయి ఇంటిని ఢీకొట్టిన కారు

● ముగ్గురికి గాయాలు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బైకును తప్పించబోయి కారు ఇంటిని ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహేందర్‌రెడ్డి అనే వ్యక్తి తన కారులో ఇద్దరు వ్యక్తులతో కలిసి కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో కొమురవెల్లి మండలం ఐనపూర్ గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్ భార్య స్వాతి, కూతురు వాహినితో కలిసి కుకునూరుపల్లికి బైక్‌పై వెళ్లి తిరిగి గ్రామానికి వెళ్లే క్రమంలో లకుడారం ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ బైక్‌ను తప్పించబోయిన మహేందర్‌రెడ్డి బైక్ ఢీకొడుతూ రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటిని కారుతో ఢీకొట్టాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహేందర్‌రెడ్డి, బైక్ మీద ఉన్న రవీందర్‌గౌడ్, అతడి కూతురు వాహినికి గాయాలయ్యాయి. వీరికి సిద్దిపేట ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇల్లుతోపాటు పక్కనే పార్క్ చేసిన బైక్ ధ్వంసమైంది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.


గాయపడ్డ రవీందర్‌గౌడ్


ధ్వంసమైన ఇల్లు, బైక్

బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పించండి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యా సంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే మొదటి గంటలోనే బాధితులు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కేసుల దర్యాప్తులో అలసత్వం వహించొద్దని సూచించారు. అనంతరం పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. సమావేశంలో డీఎస్పీలు సత్తయ్య, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సీఐలు విజయకృష్ణ, కిరణ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు


ఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో తలపడుతున్న మల్లయోధులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో వేంకటేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని, నిజాంపేట మండలం శాఖాపూర్‌లో పోచమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా బుధవారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానికులే కాకుండా దూర ప్రాంతాల మల్లయోధులు కూడా తలపడ్డారు. ఆయా గ్రామాల్లో నిర్వాహకులు కుస్తీ పోటీల స్థాయిని బట్టి కొబ్బరికాయ బహుమతి నుంచి రూ.500 వరకు బహుమతులిచ్చారు. చివరి బహుమతిగా వెండి కడియాలను అందించారు. కుస్తీ పోటీల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు తాగు నీరు, భోజన తదితర వసుతులు కల్పించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చేగుంట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్సింగ్ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన బండారు పెంటయ్య శుభకార్యం నిమిత్తం వెల్దుర్తి మండలం రామాయపల్లి తన కూతురు ఇంటికి వెళ్లారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి తులంన్నర బంగారు గొలుసు, పూజ గదిలోని గల్లలో ఉన్న రూ.5వేలు, బంగారం చోరీ ఎత్తుకెళ్లారు. బాధితులు అందించిన సమాచారం మేరకు నార్సింగ్ పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాపన్నపేటలో అదృశ్యమైన బాలిక

భువనగిరిలో ప్రత్యక్షం

పాపన్నపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాపన్నపేట కేజీబీవీ నుంచి అదృశ్యమైన అనాథ బాలిక భువనగిరిలో ప్రత్యక్షమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ అనాథ బాలిక గతంలో భువనగిరి బాలసదనంలో చేర్పించగా 7వ తరగతి వరకు విద్యనభ్యసించింది. అనంతరం మెదక్ జిల్లా కేంద్రంలోని బాలసదనంలో చేర్పించగా కలెక్టర్ ఆదేశాలతో అక్కడి అధికారులు 2024 ఆగస్టు 13న పాపన్నపేటలోని కేజీబీవీలో 8వ తరగతిలో చేర్పించారు. కాగా, బుధవారం ఉదయం అటెండెన్స్ తీసుకున్న అనంతరం విద్యార్థిని కనిపించలేదు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి రాధాకృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, డీసీపీవో కరుణశీల, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు. చివరకు బాలిక భువనగిరిలోని బాలసదనానికి చేరుకున్నట్లు అక్కడి అధికారులు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దీంతో అందరూ ఉపిరి పీల్చుకున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం!

కేజీబీవీలోని అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బాలిక అదృశ్యమైందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకరిద్దరు తప్ప మిగితావారు సమయపాలన పాటించడం లేదని, గతంలో జిల్లా విద్యాధికారి ఈ విద్యాలయాన్ని తనిఖీ చేయగా ఒక్కరూ కూడా విధుల్లో లేకపోవడంతో 8 మంది సిబ్బందికి మెమోలు సైతం జారీ చేశారన్నారు. అయినా వారిలో మార్పులు రాలేదని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తలిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థి అదృశ్యం


సుధాకర్ (ఫైల్)

మాసాయిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం రామంతపూర్‌తండాకు చెందిన అంగోత్ శ్రీను కుమారుడు అంగోత్ సుధాకర్ రామాయంపేటలోని ఎస్టీ వసతి గృహంలో ఉంటూ రామాయంపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గత నెల 11న రామంతపూర్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన సుధాకర్‌ను తిరిగి 12వ తేదీన హాస్టల్‌కు పంపించేందుకు చేగుంట బస్టాండ్‌లో బస్సు ఎక్కించారు. కాగా, ఉగాది రోజున బాలుడిని తీసుకొద్దామని హాస్టల్‌కు వెళ్లి తల్లిదండ్రులకు బాలుడు రాలేదని అక్కడి సిబ్బంది తెలిపారు. ఆందోళన చెందిన వారు బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం చేగుంట పోలీసులను ఆశ్రయించారు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలం పనికి పిలిచి వివాహితపై అత్యాచారయత్నం

● ప్రతిఘటించడంతో కత్తితో దాడి
● బొమ్మారెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో ఘటన

పుల్‌కల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పొలంలో పని ఉన్నదని పిలిచి ఓ వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడటమే కాకుండా... ఆపై కత్తితో దాడిచేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో బుధవారం జరిగింది. పుల్కల్ మండలం గొంగ్లూరు గిరిజనతండాకు చెందిన ఓ వివాహితకు కుమారుడు, కూతురు పుట్టాక భర్తతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె పుట్టినూరులోనే ఇల్లు కట్టుకుని కూలి పనులు చేసుకుంటూ పిల్లలతో కలిసి నివసిస్తున్నది. బుధవారం గుర్తు తెలియని ఓ దుండగుడు పొలంలో కూలీ పని చేసేందుకు చౌటకూర్ బస్టాండ్ వద్దకు రావాలంటూ ఫోన్‌చేసి నమ్మబలికాడు. దీంతో ఆమె అక్కడికి వెళ్లి సదరు వ్యక్తి బైక్‌పై ఎక్కగా బొమ్మారెడ్డిగూడెం వైపు తీసుకెళ్లాడు. మార్గమధ్యలో అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. దీంతో దుండగుడు మహిళ మెడపై కత్తితో దాడిచేసి గాయపర్చి పరారయ్యాడు. అనంతరం పోసానిపల్లి-బొమ్మారెడ్డిగూడెం వెళ్లే రోడ్డుపైకి వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు ఆమెను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగ్గానే ఉందని డాక్టర్లు తెలిపారు. గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. సంఘటనకు బాధ్యుడైన నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 12మందికి జరిమానా.. ఒకరికి జైలు

గజ్వేల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12మందికి కోర్టు జరిమానా విధించింది. గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మంది పట్టుబడ్డారు. నిందితులను బుధవారం గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట కోర్టులో హాజరు పరచగా వారికి రూ.8,700 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అందులో ఒకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించారు.

అక్రమ ఇసుక డంపు పట్టివేత

కోహెడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన ఇసుక డంపును బుధవారం పట్టుకుని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మోయ తుమ్మెద వాగు నుంచి కొందరు అక్రమార్కులు ఇసుకను తరలించి డంపు చేయగా, విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి 8 టన్నుల ఇసుక డంపును పట్టుకున్నట్లు వివరించారు. డంపును తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

చాంద్‌ఖాన్‌మక్తా నుంచి భద్రాచలానికి గోటి తలంబ్రాలు

వర్గల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు రామకోటి రామరాజు చేపట్టిన గోటి తలంబ్రాల కార్యక్రమం వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్తా గ్రామంలో నిర్వహించగా గ్రామస్థులు గోటితో వలిచిన వడ్లను తలంబ్రాలుగా చేసి బుధవారం భద్రాచలంలోని సీతారాముల కల్యాణానికి తరలించారు. రామకోటి భక్త సమాజం పిలుపు మేరకు గ్రామంలో రామస్మరణ చేస్తున్న గోటితో వడ్లను ఒలిచినట్లు తెలిపారు. భద్రాచలంలోని సీతారాముల కల్యాణానికి తాము వెళ్లనప్పటికీ, తాము గోటితో ఒలిచిన వడ్లు రాములవారికి అందజేయడం ఎన్నో జన్మల పుణ్యఫలమని, ఈ అవకాశం కల్పించిన రామరాజుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలి

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని బుధవారం హుస్నాబాద్ పట్టణంలో నిరుద్యోగ ఉద్యమ కళాకారులు ఆటపాటలతో ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాంస్కృతిక సారథి ఏర్పాటు చేసి 550 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించి చాలామంది ఉద్యమ కళాకారులకు మొండి చేయి చూపించన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యిమంది నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ ఉద్యోగాల కల్పనను వేగవంతం చేసి మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ప్రాంత కళాకారుల సంఘం అధ్యక్షుడు తాడూరి సురేష్, ఉపాధ్యక్షుడు పొన్నాల అశోక్, ప్రధాన కార్యదర్శి కొడముంజ రవీందర్, మంద రవీందర్, గద్ద సంపత్, గడిపె చిన్న, కల్లెం లక్ష్మన్, గజ్జెల వినోద, గొల్లపల్లి వినోద్ తదితరులున్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు గుబ్బ శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్, కోశాధికారిగా అయిత బాలరాజు, పట్టణ అధ్యక్షులు చిగులపల్లి వెంకటేశం, మండల యూత్ అధ్యక్షులు మరిపడిగ రామకృష్ణ, మండల మహిళా అధ్యక్షులు అమర నాగజ్యోతి, సేవాదళ్ అధ్యక్షులు రాచర్ల లక్ష్మణ్ కార్యవర్గంతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాల్వ సుజాత మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తర్వాత మొదటిసారి బడ్జెట్‌లో ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్‌కు మరిన్ని నిధులను కెటాయించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులను సాధించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వ్యాపార రంగంలో నష్టపోయి ఉన్న పేద ఆర్యవైశ్యులను గుర్తించి రాజీవ్ యువకిరణాలకు అప్లై చేయించే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా కోశాధికారి మంకాల నవీన్‌కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు మంకాల నాగేష్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మంకాల నాగరాణి, హేమలత, జిల్లా అధ్యక్షురాలు పబ్బా మాధవి, రవికంటి చంద్రశేఖర్, బుద్ద నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




వైద్య శిబిరానికి తరలివచ్చిన గ్రామస్థులు

మద్దూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలో సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కళాశాల మిట్టపల్లి వారి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని తహసీల్దారు రహీం, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి పీఆర్వో పరశురాములు మాట్లాడారు. సురభి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో వైద్య సేవల్ని పేదలకు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. శిబిరంలో 360 మందికి రక్త పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, స్త్రీల వైద్య నిపుణులు, కంటి సంబంధిత వైద్య నిపుణులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు సుమారు 30 మంది సీనియర్ డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, మార్కెటింగ్, హాస్పిటల్ సిబ్బందితో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మేక మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, సురభి వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ మరమ్మతు పనుల్లో నాణ్యత కరువు

- రెండున్నరేళ్ల క్రితం చిన్నకోడూరు పీహెచ్‌సీకి రూ.30 లక్షలు మంజూరు
- అధికారుల పర్యవేక్షణ లోపం.. తూతూమంత్రంగా పనులు
- పెండింగ్ పనులతో సిబ్బంది, రోగులకు తప్పని ఇక్కట్లు



ఎంసీబీ స్విచ్‌ల బోర్డుపై కప్పు అమర్చక పోవడంతో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు



గోడపై నుంచి పైప్‌లైన్ వేసి అమర్చిన స్విచ్ బోర్డు

చిన్నకోడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు మరమ్మతు పనులకు సుమారు రెండున్నరేళ్ల క్రితం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ.30 లక్షలు నిదులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత లోపించింది. అధికారుల నిర్లక్ష్యం సదరు కాంట్రాక్టర్‌కు వరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా మరమ్మతులు

ఆస్పత్రిలో ప్లంబింగ్ మరమ్మతు పనులు చేసినప్పటికీ పలు నల్లాల నుంచి నీరు లీకేజీ కావడం, మరుగుదొడ్లలో నీళ్లు సరిగా రావడంలేదు. దీంతో వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే మహిళలతో పాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులను తూతూమంత్రంగా కానిచ్చేశారని పలువురు మండిపడుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ బోర్డులు

ఆస్పత్రిలో చేసిన విద్యుత్ మరమ్మతులు సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు నాణ్యతాలోపానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ పైపులను గోడపై నుంచి వేసి అందులో నుంచి విద్యుత్ తీగలను లాగి గోడల పైన స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంసీబీ స్విచ్‌లకు సంబంధించిన బోర్డు పైకప్పు అమర్చక పోవడంతో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రోగులు, ఆస్పత్రి సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఆస్పత్రిలో మరమ్మతు పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు లేకపోలేదు.

పెండింగ్‌లో మరికొన్ని పనులు

మరుగుదొడ్లలో నూతన ఎగ్జిస్టింగ్ ఫ్యాన్స్, బేసిన్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆస్పత్రి భవనం స్లాబ్‌పై ఫ్లోరింగ్, ఆవరణలో సీసీ, గార్డెన్, ల్యాబ్ తదితర పనులు పెండింగులో ఉన్నాయి. నెలల తరబడి పనులు పెండింగ్‌లో ఉండటంతో రోగులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఏఈ బ్రహ్మంను ఫోన్‌లో సంప్రదించగా స్పందించకపోవడం గమనార్హం.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

- సీపీఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మల దహనం



సిద్దిపేటలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట అర్బన్/గజ్వేల్/దుబ్బాక/కొండపాక/చేర్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలని, విద్యార్థులు, సీపీఎం పార్టీ నాయకుల మీద నిర్బంధాన్ని అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్‌తో జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసనలు వెల్లువెత్తాయి. సిద్దిపేటలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి మాట్లాడుతూ.. సుమారు 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయవలసిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. విద్యార్థుల పోరాటానికి సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జీ అమానుషమని ఖండించారు. దుబ్బాకలో సీపీఎం మండల కార్యదర్శి నవీనా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొండపాక మండల వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాలనర్సయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు చేర్యాల పాతబస్టాండు వద్ద సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కొమురవెల్లి మండలకేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పాదయాత్రలు





గజ్వేల్:అక్కారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, హుస్నాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

గజ్వేల్/జగదేవ్‌పూర్/హుస్నాబాద్ టౌన్/కోహెడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ పిలుపు మేరకు జిల్లాల్లోని పలు మండలాల్లో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో బుధవారం జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలు, పట్టణాల్లో కాంగ్రెస్ జెండాలను చేతబూని ప్రధానవీధులగుండా ర్యాలీలు నిర్వహించారు. బుధవారం గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం గ్రామంలో, జగదేవ్‌పూర్ మండలంలోని నిర్మల్ నగర్‌లో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. నిర్మల్‌నగర్‌లో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ.. రిజర్వేషన్‌లు ఎత్తివేయడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, కేంద్రం కుట్రను గ్రామగ్రామాన తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన మోదీని దళిత సమాజం క్షమించదని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతోపాటు, దేశంలో రిజర్వేషన్‌లను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమాల్లో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆయా మండలాల ఇన్‌చార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ర్యాలీకి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కేడం లింగమూర్తి హాజరయ్యారు. పట్టణంలోని అనభేరి విగ్రహం నుంచి మల్లెచెట్టు చౌరస్తా మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు రాజ్యాంగ పత్రాలను పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా కోహెడ మండలంలోని వరుకోలు, రామచంద్రాపూర్, వింజపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ పేరిట బుధవారం పాదయాత్ర చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



హుస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మద్దూరు/హుస్నాబాద్/కోహెడ/చేర్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మద్దూరు మండల కేంద్రంలో వెలుగు, నర్సాయపల్లిలో గీతా గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎన్. శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. కోహెడ మండలంలోని కూరెళ్ల గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సురేఖ ప్రారంభించారు. చేర్యాల మండలం ఆకునూరు, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్వేత ప్రారంభించారు.

సర్దార్ సర్వాయిపాపన్నకు ఘన నివాళి

- జిల్లాలో వర్ధంతి



హుస్నాబాద్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



సిద్దిపేటలో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు సంఘాలు, ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పట్టణాలు, గ్రామాల ప్రధాన కూడళ్లలో సర్వాయి పాపన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... సర్వాయి పాపన్న రజాకర్లను ఎదిరించిన పోరాట యోధుడు... తన ప్రాణాలను సైతం లెక్కచేయని ధీశాలి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మార్క సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయిపాపన్న వర్ధంతి వేడుకలు నిర్వహించగా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు జిల్లెల్ల లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు మండలంలో వివిధ పార్టీల నాయకులు, గౌడసంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా సర్వాయిపాపన్న వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా నంగునూరు, కుకునూరుపల్లి, దూళిమిట్ట, కోహెడ, చేర్యాల, కొమురవెల్లి తదితర మండలాల్లో గౌడసంఘాల నాయకులు, ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సన్న బియ్యం నిరుపేదలకు వరం



వర్గల్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నర్సారెడ్డి

సిద్దిపేట రూరల్/సిద్దిపేట అర్బన్/వర్గల్/నంగునూరు/రాయపోల్/చిన్నకోడూరు/దూళిమిట్ట/మద్దూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి); రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్య పంపిణీ కార్యాక్రమం నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజక వర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్,నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్గల్ మండల కేంద్రంలో రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, నంగునూరు మండలం రాంపూర్‌లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, రాయపోల్‌లో స్పెషల్ ఆఫీసర్ బాబునాయక్‌తో పాటు తహసీల్దార్ శ్రీనివాస్, చిన్నకోడూరు కాంగ్రెస్ నాయకులు, దూళిమిట్ట మండల కేంద్రంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మద్దూరు మండల కేంద్రంతో పాటు నర్సాయపల్లిలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎన్. శ్వేత వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు.

కేంద్రం నిధులతోనే సన్న బియ్యం: బీజేపీ

కొండపాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం తోనే పేదలకు సన్న బియ్యం పథకం రాష్ట్రంలో అమలు జరుగుతుందని బీజేపీ కొండపాక మండల అధ్యక్షుడు నీల సత్యం పేర్కొన్నాడు. బుధవారం కొండపాక మండలం ఖమ్మం పల్లి రేషన్ దుకాణంలో పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి పథకం వివరాలను పేదలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాల కిషన్, అభిలాష్ రెడ్డి, అంజనేయులు, నరసింహులు, సాయి బాబా తదితరులు ఉన్నారు.

'మూఢనమ్మకాలను వీడాలి'

రాయపోల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందిన నేటి సమాజంలో మూఢ నమ్మకాలు అనాలోచితమని, ఎవరూ మూఢనమ్మకాలు నమ్మవద్దని రాయపోల్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో మంత్రాల నెపంతో ఓ వ్యక్తిపై దాడి జరిగిన నేపథ్యంలో మంగళవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. మూఢనమ్మకాలు లేవని నిరూపించే పలు ప్రదర్శనలు చేసి చూపించారు.

నిధులొచ్చాయ్

(5వ పేజీ తరువాయి)

లాంటి వినూత్న కార్యాక్రమాలకుగానూ అవార్డులను సాధించుకుంది. 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధులతో పట్టణాన్ని మరింత సుందరీకరణగా అభివృద్ధి కానున్నది.

శ్రమకు తగిన ప్రతిఫలమిది



ప్రతి మున్సిపల్‌లో డిమాండ్ ప్రకారం వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేసేందుకు కష్టపడతారు. కానీ సిద్దిపేట అన్నీ రంగాల్లో ముందున్నప్పటికీ ఆస్తి పన్ను పెంచడంలో మాత్రం వెనుకబడి ఉందని తెలిసింది. దీంతో ఆస్తి పన్ను పెంచాలని కౌన్సిల్ ఆమోదం, అధికారుల సమిష్టి కృషి, పట్టణ ప్రజల భాగస్వామ్యంతో రూ. 12 కోట్లు ఉన్న ఆస్తిపన్ను డిమాండ్‌ను రూ. 16 కోట్లకు పైగా అంటే రూ. 4 కోట్ల మేరకు పెంచుకున్నాం. ఆ దిశగా ఆస్తిపన్నును వసూలు చేశాం. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు సాగుతాం.

-ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

ప్రజల భాగస్వామ్యంతోనే



సిద్దిపేట పట్టణ ప్రజలను భాగస్వామ్యం చేయడం వల్లే సిద్దిపేటకు అవార్డులు వరించాయి. మున్సిపల్ సాధించిన ప్రతి విజయంలోనూ సిద్దిపేట ప్రజలు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అందించిన సహకారం, సూచనలు ఎనలేనివి. ఆ స్ఫూర్తి ని కొనసాగిస్తూ సిద్దిపేట మున్సిపల్ ముందుకెళ్తున్నది. 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వచ్చేందుకు కృషి చేసిన కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలకు అభినందనలు.

- మంజులరాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్

రాజీవ్ యువవికాసం దరఖాస్తులు అందజేయాలి

గజ్వేల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం దరఖాస్తులు మునిసిపల్ కార్యాలయంలో అందజేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 14లోపు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ జిరాక్సు, పాస్‌ఫొటో, దరఖాస్తు ఫారంతో జతచేసి మునిసిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో అనధికార దుకాణాలు

హుస్నాబాద్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణం మల్లెచెట్టు చౌరస్తా వద్దలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా అనధికార దుకాణాలు ఏర్పాటు చేసుకున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో టెండర్‌లో దక్కించుకున్న ఒక్కో దుకాణానికి రూ. 6వేల నుంచి రూ. 10వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ స్థలానికి కూడా టెండర్ వేస్తే మున్సిపల్‌కు అదనపు ఆదాయం వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రాచీన సాహిత్యంపై సదస్సు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రాచీన సాహిత్యం- కవితారీతులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పురాణేతిహాసాలలో ప్రసన్నకథాకలితార్థయుక్తి అనే అంశంపై అష్టావధాని బ్రహ్మశ్రీ గౌరీభట్ల రుక్మిణీ బాలముకుందశర్మ ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. సునీత మాట్లాడుతూ విద్యార్థులు ప్రాచీన సాహిత్యం పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తెలుగు విభాగాధిపతి డా. మట్టా సంపత్‌కుమార్‌రెడ్డిని, తెలుగు విభాగ అధ్యాపకులను అభినందించారు. సదస్సులో పిట్ల దాసు, ఎన్. వెంకటరమణ, సంపత్, రామస్వామి, నరేష్, నర్సింలు, శైలజ, రమణ, సాయి సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన

చేర్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి పోలీసుల ఆధ్వర్యంలో కొమురవెల్లి జడ్పీఎస్ఎస్‌లో బుధవారం సైబర్ జాగరూకత దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గజ్వేల్: విద్యార్థి దశ కీలకమని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు ఆయా చట్టాలపై అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు చేయూత

రాయపోల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ గ్రామానికి చెందిన పాదుల్ల అప్పుల బాధతో ఇటీవల పురుగుల మందు తాగి మృతి చెందాడు. అలాగే తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ల అనారోగ్యంతో బాధడుతూ మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించి, నిత్యావసర సరుకులను అందజేశారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client Saini Samatha W/o Saini Thirumal., is intending to purchase the below mentioned schedule of property from its owners viz. 1. **Sri. Mohammad Akbar, S/o. Mohammad Bhupati, 2. Smt Farizanaazmi, W/o. Mohammad Akber,** both residents of #2-25. Lakudaram Vilage, Kukunoorpally Mandal, Siddipet Dist, Telangana State. If anybody is having any objection, claim, interest, dispute for the above intended sale transaction, he/she/they may contact the undersigned with the documentary proof substantiating his/her/their objections/claims/details of disputels witin Seven(7) days from the date of this publication, faling which, my client will proceed to complete the sale transaction with the above owner as if there are no third party claims/ objections/ disputes in respect of the Schedule Property and thereafter no claims/objections/disputes will be entertained.

SCHEDULE OF PROPERTY

All that the agricultural land having extent of **Ac 0-11 Gts in Sy No.44/A/1/1/2/1.**, extent of **Ac 0-17 Gts in Sy No.44/A/1/1/3.**, extent of **Ac 0-17Gts in Sy No. 44/A/1/1/4**, extent of **Ac 0-26 Gts in Sy No. 44/A/1/2.**, land extent **Ac 0-26 Gts in Sy No. 44/A/2.**, land extent **Ac 0-03 Gts in Sy No.45/A/1/2.**, total land admeasuring **Ac 2-20 Gts**, of lakudaram village, Kukunoorpally Mandal, Siddipet District, Telangana.,

Date : 02-04-2025

Sd/- G.SREENIVAS
ADVOCATE
101, Narayanadri Nivas, Gokhle Nagar,
Ramanthapur, Hyderabad- 500013
Cell.No: 9059977636, 9666131415